ఫైర్‌సేఫ్టీపై అవగాహన

ఆమనగల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటు నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై బుధవారం అగ్నిమాపక శాఖ అధికారులు విక్రయదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహేశ్వరం ఈఎఫ్‌వో నాగార్జున హాజరై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దుకాణాల ఎదుట అన్ని ఫైర్‌సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ దుకాణం ఎదుట ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



వెలుగుల సంబురం

దీపాల కాంతుల్లో మెరుస్తున్న లోగిళ్లు

పూల అలంకరణలో ముస్తాబైన ఇళ్లు

లక్ష్మీపూజ, నోములు, వ్రతాలకు సర్వం సిద్ధం

బంధుమిత్రులతో కళకళలాడుతున్న పల్లెలు

దీపావళి పర్వదినాన తెలుగింటి లోగిళ్లు కళకళలాడుతున్నాయి. దివ్వెల అలంకరణతో ఇళ్లన్నీ మిరుమిట్లుగొలుపుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటు చూసినా రంగురంగుల పూల తోరణాలు దర్శనమిస్తున్నాయి. బంధుమిత్రులతో పల్లెలు, పట్నం అనే తేడా లేకుండా నిండుగా కనిపిస్తున్నాయి. గురు, శుక్రవారాల్లో లక్ష్మీపూజ, వ్రతాలు, నోములు నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పండగను సంబురంగా జరుపుకునేందుకు భారీగా టపాసుల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే క్రాకర్స్ మెరుపులు, టపాసుల మోతలు వినిపిస్తున్నాయి. కాగా, కొనుగోలుదారులతో బుధవారం మార్కెట్లు, దుకాణసముదాయాలు కిక్కిరిసాయి. మహిళలు పూలు, ప్రమిదల, పూజా సామగ్రిని పెద్ద మొత్తంలో కొనుగోలు చేశారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివాసముండే వారంతా పిల్లాపాపలతో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు.

-ఆమనగల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి)



ఆమనగల్లులో బంతిపూల విక్రయాలు

అరటి బోదెలకు భలే గిరాకీ

మర్పల్లి: దీపావళి పండగ సందర్భంగా అరటి బోదెలకు భలే గిరాకీ ఉంది. లక్ష్మీ పూజలో వీటిని విధిగా ఉపయోగిస్తుండటంతో భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో రైతులు అరటి చెట్లతో పాటు పిల్ల మొక్కలను కోసి నగరానికి తరలిస్తున్నారు. ఒక్కో బోదెకు రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు. మర్పల్లి మండలంలోని బూచన్‌పల్లి, దామస్తాపూర్, కొంశెట్టిపల్లి, పట్లూర్ తదితర గ్రామాల నుంచి అరటి బోదెలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

» అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



వికారాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిరు దివ్వెలతో చీకట్లను పారదోలేది దీపావళి అని, ఈ పండగ ప్రతీ ఒక్కరి జీవితంలో వెలుగులను నింపాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు. పేదలు, రైతుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తగు జాగ్రత్తలతో కుటుంబ సభ్యులందరూ కలిసి ఆనందోత్సహాల నడుమ దీపావళిని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



దళిత రైతులతో మాట్లాడుతున్న బాల్‌రాజు

నేదునూరులో ఆగని భూపోరాటం

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేదునూరు గ్రామంలో ఇనామ్ భూమి దళితులకే చెందాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భూపోరాటం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. పార్టీ గ్రామ కార్యదర్శి మిద్దె యాదయ్య ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటంలో ఆ పార్టీ మండల నాయకులు బుట్టి బాల్‌రాజ్ పాల్గొని మాట్లాడారు. నేదునూరు రెవెన్యూ పరిధిలోని 154సర్వే నంబర్‌లోని ఎకరం 35గుంటల భూమి అదే గ్రామానికి చెందిన ఇద్దరు దళిత రైతుల పేర 1954 నుంచి 1993 వరకు రెవెన్యూ రికార్డుల్లో ఇనామ్ పట్టాగా పేరు వచ్చిందన్నారు. కానీ, అదే గ్రామానికి చెందిన మునగాల వెంకట్‌రెడ్డి రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు మార్చుకొని తన పేరుపై చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆ భూమి దళితల పేర రికార్డుల్లో రాసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శ్రీనివాస్, చెన్నయ్య, నరసింహ, యాదయ్య, రాజయ్య, శ్రీనివాస్, సురేష్, మరియు మహిళలు పాల్గొన్నారు.

చేవెళ్ల ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



చేవెళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల నూతన ఆర్డీవోగా చంద్రకళ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు ఘనస్వాగతం పలికారు. అలాగే డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాలోని తహసీల్దార్లు పూల బొకేలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలను సక్రమంగా అమలు చేస్తామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు బాధ్యతగా పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమగ్ర సర్వే పక్కాగా ఉండాలి

- జిల్లా స్త్రీశిశు సంక్షేమాధికారిణి సంధ్యారాణి

యాచారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభం కానున్న సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, విధిగా ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారిణి సంధ్యారాణి సూచించారు. బుధవారం యాచారం మండలంలోని యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)పై ఎన్యుమరేటర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి సంబంధించిన అన్ని రకాల వివరాలను నమోదు చేయాలన్నారు. ఇంటి యజమానితో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లను నమోదు చేసుకోవాలన్నారు. దివ్యాంగుల వివరాలను కూడా విధిగా నమోదు చేయాలన్నారు. అనుమానాలుంటే సూపర్‌వైజర్లతో మాట్లాడలన్నారు. తప్పులు రాసి దిద్దడం చేయకూడదని చెప్పారు. ఇంట్లో అద్దెకున్న వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇతర జిల్లాలకు వలస వెళితే దానిని వలస కిందకు తీసుకోరాదని సూచించారు.



ఎన్యుమరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి



చంటిపాపతో శిక్షణకు..

ఎన్యుమరేటర్ల శిక్షణకు తమ్మలోనిగూడకు చెందిన ఎన్యుమరేటర్ సంధ్య తన చంటిపాపతో శిక్షణకు రావడం అందరి దృష్టిని ఆకర్షించింది. చంటిపాపను ఎత్తుకొని అధికారులు చెప్పిన వివరాలను ఆమె నోట్ చేసుకోవడంతో అధికారులు కూడా ఆమె అంకిత భావాన్ని అభినందించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, ఎంఈవో పాండురంగారెడ్డి, ఇబ్రహీంపట్నం డివిజన్ ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో తులసి, కార్యాలయ పర్యవేక్షకురాలు శైలజ తదితరులున్నారు.



స్పోర్ట్స్ మీట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికే క్రీడా పోటీలు

ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వ్యక్తిత్వం, సమగ్ర వికాసం కోసం క్రీడా పోటీలను స్పోర్ట్స్ మీట్ పేరిట ఎన్టీఆర్ ట్రస్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థల డీన్ రామారావు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వం, సమగ్ర వికాసం కోసం పోటీలను జిల్లా స్థాయిలో ఈ ఏడాది నుంచి ప్రారంభించామన్నారు. నవంబరు 4 నుంచి మూడు రోజుల పాటు జరిగే అన్ని రకాల క్రీడల పోటీలను పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఎన్టీఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు అన్ని క్రీడల్లో పాల్గొంటారని ఇంటర్, డిగ్రీ విద్యార్థినులకు ప్రత్యేకంగా క్రీడల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పెయింటింగ్, ర్యాంప్‌వాక్, రంగోలి, మేహంది, కరాటే ఫుడ్‌ఫెస్టివల్‌తో పాటు పలు సంస్కృతిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఎన్టీఆర్ విద్యాసంస్థలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో జిల్లాలోని దాదాపు 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. నవంబరు 4న రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరక్టర్ నార్మద ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే. రెడ్డి, రాంచంద్రారెడ్డి, రాజీవ్‌రెడ్డి, ఏఓ సురేష్ తదితరులు ఉన్నారు.



రేగడిదోస్వాడ గ్రామస్తులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

కేంద్ర పథకాలు అర్హులకు చేరవేయాలి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేవిధంగా కార్యకర్తలు చూడాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో మాజీ సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌లతో పాటు పలువురు గ్రామస్తులు బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదులో దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. కాగా, మండల పరిధిలోని రేగడిదోస్వాడ పశువుల ఆసుపత్రికి నూతన భవనాన్ని మంజూరు చేయాలని ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డిని పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కిరణ్, మాణయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ భిక్ష కాదు.. విద్యార్థుల హక్కు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు భిక్ష కాదని.. విద్యార్థుల హక్కు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.7,800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఇబ్రహీంపట్నంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి సాగర్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణలో పాలకులు మారినా ప్రజల బతుకులు మారలేదన్నారు. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కాంగ్రెస్ కూడా పట్టించుకోకుంటే ఎలా అని ప్రశ్నించారు. మూడేళ్లుగా బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని, ఇది చదువులపై తీవ్ర ప్రభావం చూపుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు కందాడి శ్రీరామ్, విభాగ్ కన్వీనర్ సూర్య ప్రకాశ్, జిల్లా కన్వీనర్ శివకృష్ణ, జగదీశ్, మహేందర్ పాల్గొన్నారు.



సాగర్ రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

తిరునక్షత్ర మహోత్సవానికి సీఎంకు ఆహ్వానం



శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక గురువు శ్రీ త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి తిరునక్షత్ర(పుట్టిన రోజు) నవంబరు 1 నుంచి 5 వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మహోత్సవానికి రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలను అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్‌స్వామి బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. తప్పకుండా స్వామివారి పుట్టిన రోజు వేడుకలకు హాజరవుతామని సీఎం, డిప్యూటీ సీఎం చెప్పినట్లు సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం ప్రతినిధులు పేర్కొన్నారు. నగరం నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రతలు తీసుకుంటున్నట్లు స్వామిజీ తెలిపారు.

పెట్టుబడులకు ముందుకు రావాలి

విదేశీ కంపెనీలకు టాస్క్ సీవోవో సుంకిరెడ్డి వినతి

ఆమనగల్లు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి బుధవారం లాస్ వేగాస్ లో జరిగిన ఐటీ సర్వ్ సీనర్జి సమ్మిట్‌లో పాల్గొన్నారు. ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్‌తో కలిసి టాస్క్ సీవోవో రాఘవేందర్‌రెడ్డి వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్మార్ట్ గవర్నెన్స్ కోసం ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళిక, యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ లక్ష్యాలు, ఫ్యూచర్ సిటీ ఏర్పాటు గూర్చి విదేశీ కంపెనీల ప్రతినిధులకు సమ్మిట్‌లో ఆయన వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం సానుకూల వాతావరణం కల్పిస్తుందని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని విదేశీ కంపెనీల ప్రతినిధులను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



ఐటీ సమ్మిట్‌లో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

సీపీఐ ఆవిర్భావ వేడుకలను
విజయవంతం చేద్దాం

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

చేవెళ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భావ వేడుకలను జిల్లావ్యాప్తంగా నిర్వహించి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వేడుకలను జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని నాయకులకు సూచించారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, మండల ప్రధాన కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు : ఏడీఏ

కేశంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగ్రోస్ సేవ కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ, కేశంపేట మండల ప్రత్యేకాధికారి రాజారత్నం తెలిపారు. బుధవారం అల్వాల రైతువేదికలో తెలంగాణ సీడ్ కార్పొరేషన్ సంస్థకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.









'సమగ్ర సర్వే'ను పక్కాగా చేపట్టాలి

కేశంపేట/ఆమనగల్లు/చౌదరిగూడ/షాద్‌నగర్ అర్బన్/షాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్రంగా చేపట్టాలని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని అల్వాల రైతువేదికలో బుధవారం ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు బ్యాచ్‌లు విభజించి శిక్షణ ఇచ్చారు. కులగణన సర్వేను సమగ్రంగా చేపట్టాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. పట్టణంలోని రైతువేదికలో సర్వే నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఆమనగల్లు : మాట్లాడుతున్న కమిషనర్ వసంత

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుసుమ మాధురి అధ్యక్షతన ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ లలిత, తదితరులున్నారు. కుల గణనను ఎన్యుమరేటర్లు, అధికారులు బాధ్యతగా నిర్వహించాలని జిల్లేడ్ చౌదరిగూడ మండల ప్రత్యేకాధికారి వెంక్యానాయక్ సూచించారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో సమగ్ర సర్వే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కులగణన సర్వేను సమగ్రంగా నిర్వహించాలని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న సూచించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆఫీసులో కుల సర్వేపై ఎన్యూమరేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షాబాద్ ఎంపీడీవో అపర్ణ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌లు.. ఎంపీడీవో సమావేశం మందిరం, రైతువేదికలో అధికారులతో సమావేశం నిర్వహించారు.

ప్రజల జీవితాల్లో సంతోషాల వెలుగులు నిండాలి

ఆమనగల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెలుగుల పండుగ దీపావళి ప్రజల జీవితాల్లో కష్టాల చీకట్లు తొలిగిపోయి సంతోషాల వెలుగులు నింపాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్టశక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు ప్రతీ కుటుంబానికి చేకూరి ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని, ప్రతీ ఇంట ఆనంద కాంతులు విరజిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పనిచేస్తూ వారి జీవితాల్లో ప్రగతి కాంతులు నింపుతుందని నారాయణరెడ్డి పేర్కొన్నారు.



కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

చేవెళ్ల ఎంపీ కనిపించడం లేదని ఫిర్యాదు

చేవెళ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కన్పించడం లేదని బీఆర్ఎస్ నేతలు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎన్నికల్లో గెలిచి మళ్లీ కనబడటం లేదని పోలీస్‌లకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి గురించి ఎంపీ పట్టించుకోవడం లేదని నాయకులు సీఐ భూపాల్ శ్రీధర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పటేల్ చొరవతోనే తెలంగాణకు విముక్తి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతోనే తెలంగాణకు విముక్తి లభించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పటేల్ జయంతిని పురష్కరించుకొని రాయికల్‌లోని జ్యోతిరావుపూలే కళాశాల ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటుచేసిన ఐక్యతా పరుగు(రన్ ఫర్ యూనిటీ)ను ఆయన ప్రారంభించారు. రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమైన పరుగు పట్టణ వీధుల మీదుగా కొనసాగింది. ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, డిప్యుటీ వార్డెన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యారాణి పదవీ బాధ్యతల స్వీకరణ

యాచారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యాచారం మండల ప్రత్యేకాధికారిణిగా రంగారెడ్డి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి సంధ్యారాణి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రగతికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఇంతకుముందు ప్రత్యేకాధికారి బదిలీ కావడంతో ప్రభుత్వం సంధ్యారాణిని నియమించింది. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించనున్నట్లు సంధ్యారాణి ఈ సందర్భంగా తెలిపారు.



ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడాలి

తలకొండపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ముదిరాజ్‌లు సంఘటితంగా ముందుకు సాగాలని, ప్రభుత్వాలు వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలని ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు బొల్లా యాదగిరి, మాజీ జడ్పీటీసీ పద్మనర్సింహులు పిలుపునిచ్చారు. ముదిరాజ్‌ల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, వృత్తిరక్షణకు ప్రభుత్వాలు చేయూతనందించాలన్నారు. మండల కేంద్రంలో బుధవారం సంఘం మండల సమావేశం నిర్వహించారు. ముదిరాజ్‌లు, మత్స్య కార్మికుల సమస్యలపై చర్చించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చౌదరిగూడ మండలం తూంపల్లికి చెందిన గట్టుపల్లి యాదయ్య(40) బుధవారం బైక్‌పై షాద్‌నగర్‌కు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పరిగి రోడ్డులో డివైడర్‌ను ఢీకొన్నాడు. దాంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

మోటార్ సైకిళ్ల దొంగ రిమాండ్

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, షాపులు, బస్టాండ్, వైన్‌షాపులు, రైల్వేస్టేషన్ వద్ద నిలిపిన వాహనాలను దొంగిలించి అమ్ముకుంటున్న దొంగను బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సూరమోని శ్రీశైలం పెయింటర్. కాగా, చిల్కమర్రికి చెందిన గురువుల రమేష్ షాద్‌నగర్‌లో పాల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈనెల 24న ఇంటి ముందు నిలిపిన మోటార్‌సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లినట్లు ఫిర్యాదు చేయగా విచారణ చేసి నిందితుడు శ్రీశైలంను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

చేవెళ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ ప్రతిభ చాటాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీటీ గురుకుల పాఠశాల(మినాయపూర్) విద్యార్థులు జిల్లాస్థాయిలో అండర్-17, 14 విజేతలుగా నిలిచారు. బుధవారం ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించి విద్యార్థినులను అభినందించారు. అలాగే ఎమ్మెల్యే యాదయ్య క్యాంపు కార్యాలయంలో 97 మంది లబ్ధిదారులకు రూ. 39.47లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ ఎంపీటీసీ రాములు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ నారాయణరెడ్డికి ఘన సన్మానం

కందుకూరు/మహేశ్వరం/శంషాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న నారాయణరెడ్డిని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ గౌస్ బుధవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘం నేతలు కె.ప్రవీణ్, జి.రాజు ఉన్నారు. మహేశ్వరం ఎంపీడీవో శైలజారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు తదితరులు కలెక్టర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ప్రజాసమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



మహేశ్వరం : కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీవో శైలజారెడ్డి



సంక్షిప్త సమాచారం

● **మొయినాబాద్ రూరల్** : అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ మండలాధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డిలకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **ఇబ్రహీంపట్నం** : బాలికలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడానికి, స్వీయ రక్షణకు కరాటే, యోగా శిక్షణ తీసుకోవాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికల ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

● **ఆమనగల్లు** : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఎమ్మార్సీ భవనంలో ఎంఈవో పాండుకు రాష్ట్ర నాయకులు సంతోష్ ఆధ్వర్యంలో వినతిపత్రమిచ్చారు.

● **చౌదరిగూడ** : అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన టపాసుల దుకాణాల టెంట్లను పోలీసులు తొలగించారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో దీపావళి సందర్భంగా మండల కేంద్రంలోని చౌరస్తాలో ఏర్పాటు చేసిన దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు.

● **చేవెళ్ల** : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా సీనియర్ నాయకులు శ్రీనివాస్, శర్వలింగంలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లారెడ్డిగూడలో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలు చేయించారు.

● **కందుకూరు** : ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్న ఎస్.జగదీశ్వర్‌రెడ్డిని కార్యాలయ సిబ్బందితో కలిసి డీటీ బి.రాజు, రాజేశ్వరిలు సత్కరించారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు.













